# 48

# భయం... భయం... బతుకు భయం!

ఒక మహా సామ్రాజ్యం పతనమవడానికీ, నామరూపాలు లేకుండా పోవడానికీ, ఒక 'పశ్రీనాడా' కారణమంటే, కాదు - 'నాడామేకు' కారణమంటే మనకు నమ్మబుద్ధి కాదు కానీ ఇది నిజం! ఒక మహాసామ్రాజ్యానికి చెందిన సర్వసైన్యాధ్యక్షుడు తన బలాలు యుద్ధరంగంలో ఎలా పోరాడుతున్నయో తెలుసుకోవడానికి గుర్రం మీద పర్యవేక్షిస్తున్నాడు. తనవారిని ఉత్సాహపరుస్తున్నాడు. కొందరిని హెచ్చరిస్తున్నాడు. పోరు జోరుగా సాగుతున్నది. అవతలవారు కూడా చావుకు తెగించి యుద్ధం చేస్తున్నారు. యుద్ధరంగమంతా కత్తుల ఖణఖణలతో, సైనికుల హాహాకారాలతో, హయహేషలతో, ఘీంకారాలతో, నెత్తురు మడుగులతో నిండిపోయింది. రెండు పక్షాలవారూ వీరావేశంతో యుద్ధం చేస్తున్నారు.

హఠాత్తుగా మన యోధుని గుర్రం కుంటడం ప్రారంభించింది. అయినా అతను చలించలేదు. అన్ని చోట్లా తిరుగుతూ, హెచ్చరిస్తూ ప్రోత్సహిస్తూ, శతసహస్ర రూపాలతో కనబడుతున్నాడు. కుంటుతున్న గుర్రం - నడవలేక ఒరిగిపోయింది. ఇది చూసిన స్వపక్ష సైనికులు ధైర్యాన్ని కోల్పోయారు. ప్రతిఘటన సన్నగిల్లింది. ఎదరి- విజృంభించడంతో, ఈ సైన్యం వెనకడుగువేసి, కొసకు పిక్కబలం చూపించారు. దాంతో ప్రతి పక్షులు చెలరేగిపోయారు. రాజ్యాన్ని ఆక్రమించుకొన్నారు. కొద్ది రోజుల్లోనే పూర్వరాచరికపు చిహ్నాలు అన్నింటినీ సమూలంగా తొలగించి వేశారు.

ఇన్నిటికీ, మన సర్వసైన్యాధ్యక్షుడు అలా కావడానికి కారణమేమిటి? అతనెక్కిన గుర్రం చాలా మంచిది కానీ, దాని కాలిగిట్టక్కొట్టిన నాడా అంత సజావయింది కాదు. ముందుగా నాడా మేకు ఊడింది. తరువాత నాడా తిరగబడి పాదం లోకి గుచ్చుకుపోయింది. ఆ బాధను ఓర్చుకొంటూనే గుర్రం, విశ్వాసపాత్రంగా పరుగెత్తింది. నెత్తురంతా వోడ్చుకు పోవడంతో నీరసపడి యుద్ధరంగం మధ్యన కుప్పకూలిపోవడంవల్ల, ఆ సామ్రాజ్యం శత్రువుల చేతికి చిక్కింది.

ఆ గుర్రానికి నాడా కొట్టిన వాడెవడో మనకు తెలియదు. తెలిసిందల్లా, అతగాడికి మన కాశయ్యకున్నంత నిజాయితీ లేదని మాత్రమే.

కాశయ్యది ఈ ప్రాంతమే, ఇక్కడి వాడే. తన ముత్తాతల ముత్తాతలు నేతులు తాగారో లేదో అతనికి పట్టదు. వారి పేరున తన మీసాలను మెలితిప్పుకోవలసిన అవసరంగానీ, అసలంతటి వ్యవధానంగానీ అతనికి లేవు.

తరతరాలుగా- అంటే కనీసం మూడు తరాలుగా వారి వంశం ఈ వృత్తిలోనే ఉండి ఆ ఇంతకాలంలోనూ, ఈ రంగంలో వచ్చిన మార్పులేమీ లేవంటాడు కాశయ్య. రావలసిన అవసరం కూడా లేదన్నది అతని అభిప్రాయం. ఎద్దులు, గుర్రాలు, దున్నపోతులు, ముఖ్యంగా వీటికి నాడాలు వేయడం అతని వృత్తి. అప్పుడప్పుడు గేదెలకు కూడా వేస్తూంటాడుట!

"బర్రెలకు ఎవరోగానీ వేయించరండీ! పల్లెటూళ్ళలో అసలే ఈ అలవాటు లేదనుకోండి! ఇక్కడయినా బాబూ, ఈ సిమెంటు రోడ్లమీద అదే పనిగా తిరగడం వల్ల గిట్టలు అరిగిపోతాయి. చిగురు అంటుతుంది. అందుకనే వేయిస్తారు" అన్నాడు కాశయ్య.

ఎడ్లకు, గుర్రాలకూ నాడాలు వేయించడం చాలా అవసరమనీ, లేకపోతే కొద్ది కాలంలోనే అవి పనికి మల్లబడతాయని కాశయ్య అన్నాడు.

"మనం చెప్పులకు నాడాలు ఎందుకేసుకొంటున్నాం చెప్పండి? ఇదీ అంతే? నాడాలు వేయిస్తే గిట్టలు అరగవు. కాళ్లతీపులు ఉండవు. రేట్లు కూడా ఇదివరకన్నా నయమే గానండీ లెక్క చూసుకొంటే, మిగిలి చచ్చేదీ ఏమీ కనబడదు. ఎడ్లకయితే - గుర్రాన్ని బట్టి ఆరు, ఆరున్నర మొదలుకొని పదిరూపాయల దాకా తీసుకొంటాం" అన్నాడు కాశయ్య.

ఈ ధరల తేడాకు కారణం, వాటిల్లోని సైజు భేదం అని చెప్పాడు.

తనక్కావలసిన నాడాలు, నాడా మేకులు షాపుల్లో కొని తెచ్చుకుంటానని, తను కూడా తయారు చేసుకుంటాననీ, అతనన్నాడు.

గీసి గీసి బేరమాడతారు కొంతమంది. వారికి చే తయారీని వాడతాను. కొంతమంది అడిగినంతా ఇస్తారు. వారికి కంపెనీ సరుకు వాడతా. యీ సంగతి కూడా వారికి ముందుగానే చెబుతా. ఎవరు ఏది కోరుకుంటే అదే సరుకు వుపయోగిస్తా అన్నాడు కాశయ్య. తన దగ్గరున్న రెండు రకాల సంచుల్లోని సరుకునూ చూపెడుతూ.

ఎవరు బేరమాడతారో, ఎవరు గొణుక్కుంటారో, ఎవరు అడిగిందానికన్నా ఎక్కువ ఇస్తారో తను సులువుగా అంచనా వేయగలనన్నాడు కాశయ్య.

"ఇందులో చిత్రమేమీ లేదండీ! చాలా సంవత్సరాలుగా మనుషులతో మెలగడం వల్ల ఇది తెలుస్తుంది. ఎలా తెలుస్తుందంటే మాత్రం నేను చెప్పలేను" అన్నాడు కాశయ్య నవ్వుతూ.

ఈ మధ్య సన్నకారు జనానికి, వృత్తి పనివారికీ బ్యాంకులు అప్పులిస్తున్నాయని ఎవరో అంటే, కాశయ్య కూడా ప్రయత్నించాడు.

"ఓ ఏడుపేడిచి ఊరుకున్నా" అన్నాడు కాశయ్య చిరచిరలాడుతూ.

అతని పనిక్కావలసిన సామాన్లు కూడా చాలా కొద్దిగానే ఉన్నాయి. రెండు మూడు సుత్తెలు, ఒక పెద్ద పట్టకారు. ఇంకో కటింగ్ ప్లేయర్, కన్నాలు వేయడానికో, 'బదమ' ఉక్కు పోగరు, శానం, బలుసాకురాయి, పెద్ద మేకు - ఇవి చాలు.

సొంతంగా నాడాలు తయారు చేయడానికి కావలసిన సరంజామా అంతా ఉన్నది. ఓ తాగలి, చచ్చువకంగా ఉన్న ఉక్కు దిమ్మచిన్న మలాటా, అడ్డగాళ్ళ సుత్తి, రెండు మూడు శానాలు, జవగారు, పట్టకార్లు, మొద్దు ఆకురాయి కటింగ్ చేసే మిషను- ఇది మరీ అంత ముఖ్యం కాదు - ఈ సరుకంతా ఉన్నది. వీటి పక్కనే 'సాన' - 'సానరాయి' కూడా ఉన్నాయి.

"మందంగా ఉండే ఇనుప బద్దెలు, చెడిపోయిన బండి పట్టాలు, పనికిరాని ఇనప గంటికాడలు, వీటితోనే నాడాలు, నాడా మేకులు తయారు చేస్తానండీ! ఇవి టోకుగా కొనిపడేస్తా" అన్నాడు కాశయ్య బద్దెల్ని, బండి పట్టాముక్కల్ని, శాయిమేకుల్ని చూపిస్తూ.

"కోడెదూడలు, గిత్తలు - మా పొగరుమీద ఉంటాయండి! ఉచ్చువేసి కింది పడేసినా, తన్నుకొంటూనే ఉంటాయి. ఒక్కోసారి జాడించి తంతూ ఉంటాయి కూడా. అలాంటప్పుడు దెబ్బలు తగుల్తాయి. అప్పుడప్పుడు కోర కొమ్ములతో కుమ్ముతాయి. అవన్నీ చూసుకుంటూ ఉండాలి!"

అన్నాడు కాశయ్య తనతొడ మీద అప్పుడెప్పుడో తగిలిన గాయం మచ్చను చూపిస్తూ.

"ఎంత జాగ్రత్తగా చేసినా మా వల్లకూడా పొరబాట్లు జరుగుతుంటాయండీ! ఎప్పుడన్నా నాడా మేకు చిగురంటి, కాలికి దెబ్బతగులుతుంది. నెత్తురు కారుతుంది. వెంటనే మందిస్తాను. మందంటే జీడి, గుగ్గిలం, దూది కలిపి తయారు చేసి దాన్ని గాయానికేసి కడతా, తెల్లారేటప్పటికి నయమవుతుంది. ఒక్కొక్కప్పుడు మేకులు పైకి వెళ్లి కొస్తాయి. నాడాను దాటి గిట్ట వెలుపలికి పొడుచుకొని ఉంటుంది. అప్పుడేం చేస్తానంటే, మేకును పక్కకు వొగకొడతా, గిట్టను ఉలితో చివ్వేసి, బలుసాకు రాయితో నునుపు చేస్తా. నడిచేటప్పుడు కొన్ని ఎడ్లకు గిట్టలు రాసుకుంటాయి. అలాంటప్పుడు గిట్టలకు లోవరసగా ఉండేటట్టుగా నాడాలు కొడతా!" ఇవన్నీ కాశయ్య అభినయిస్తూ సులవుగా తెలియడానికి మధ్య మధ్య బొగ్గుతో నేలమీద గీస్తూ చెప్పుకొచ్చాడు.

అతనిది పెద్ద సంసారం. నలుగురు పిల్లలు, పెద్దాడు అయిదో తరగతి వరకూ చదివి మానేశాడు. రెండు, మూడు ఆడపిల్లలు, ఆఖరు వాడికి ఎనిమిదేళ్ళు, పెద్దబ్బాయిని ఈ మధ్యనే కలప అడితిలో పనికి కుదిర్చాడు. భార్య- ఇంటిదగ్గరే మేకులు తయారు చేస్తుంటుంది.

"ఏం పెనుక్కుంటే ఏముంది బాబూ? పొట్ట గడవడం కష్టం. అందరం ఒళ్ళు పులిసిపోయేలాగా విరగబడతాం... అయినా అంతేనండీ! దీనికి తోడు. ఈ పోలీసుల పీడాకారం ఒకటి- వారానికోసారి, పదిరోజులకోసారి వచ్చి రెండో మూడో లాక్కుపోతారు. ఇవ్వకపోతే కేసు పెడతారు. లేదుబాబూ, సొంతకొంపలేదు. అప్పుడెప్పుడో పేదోళ్ళకు స్థలాలు ఇస్తామన్నారు. దరఖాస్తు చేశా. మా బస్తీ లీడరు మా దగ్గర పదేసి పదేసి వసూలు చేశాడు. ఇంకా 'ఇదిగో' 'అదిగో' అంటూనే ఉన్నారు. గట్టిగా అడగలేం. అడిగిన వాళ్ళను ఆయన కొట్టించాడు" అన్నాడు కాశయ్య తాగుతూన్న సిగరెట్టును కొలిమిలోకి విసిరేస్తూ.

సంవత్సరంలో ఏడెనిమిది మాసాలపాటే ఈపని ఉంటుందట.

"మిగతా రోజుల్లో గడ్డిపారలు చీరుస్తా, కొడవళ్ళు సానపడతా, గొడ్డళ్లు తయారు చేస్తా, యేమి చేస్తే ఏముంది లెండి? పొద్దున లేస్తే ఎట్లా గడుస్తుందా అన్న భయంతోనే ఛస్తుంటాం".

నిజమే!

ఆ భయం - బతుకంటే భయం అతని నిలువునా కనిపిస్తూనే ఉంటుంది.

అతని భయం తీరేదెప్పుడు?

అందరిలా అతనూ తృప్తిగా, నిర్భయంగా జీవించేదెప్పుడు??